క్లుప్తంగా

ప్రశాంతంగా ఏపీ ఈఏపీసెట్ ఆగ్రికల్చర్ పరీక్ష

పెడన:మండల పరిధిలోని నందమూరు శ్రీవాసవి ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఏపీ ఈఏపీసెట్ ఆగ్రికల్చర్ పరీక్ష సోమవారం ప్రశాంతంగా జరిగింది. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు జరిగిన సెషన్‌లో 82 మందికి 81 మంది హాజరవ్వగా ఒకరు అబ్సెంట్ అయ్యారని కళాశాల ప్రిన్సిపల్ బీఆర్ఎస్ రెడ్డి, ఆడ్మిన్ అశోక్‌కుమార్ తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగిన రెండో సెషన్‌లో 82 మందికి 77 మంది హాజరయ్యారని, ఐదుగురు అబ్సెంట్ అయ్యారన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పరీక్ష ప్రశాంతంగా జరిగిందని పేర్కొన్నారు.

100 మందికి ఉచిత కంటి వైద్య పరీక్షలు

కోడూరు:మండలంలోని పిట్టల్లంక పంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. రేపల్లెకు చెందిన ఫోకస్ కంటి ఆసుపత్రి పర్యవేక్షణలో నిర్వహించిన ఈ శిబిరంలో 100 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యులు కిషోర్, దాస్, మేరుగ ప్రవీణ్ రోగులకు కంటి పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు చేయించనున్నట్లు వైద్యులు చెప్పారు. పలువురు రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సర్పంచ్ కనగాల వెంకటేశ్వరరావు ఈ శిబిరాన్ని ప్రారంభించగా, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

చల్లపల్లి:స్థానిక వాసవీ క్లబ్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 50 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యులు శ్రావణి, మణికంఠలు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. వైద్య శిబిరాన్ని వాసవీ క్లబ్ అధ్యక్షురాలు మాజేటి అమరవాణి, దింటకుర్తి జ్యోతి ఇతర సభ్యులు పర్యవేక్షించారు.

కోతుల బెడద నుంచి రక్షించండి



కోడూరు:కోతుల బెడద నుంచి తమను రక్షించాలంటూ పంచాయతీ పరిధిలోని అంబటి బ్రాహ్మణయ్య కాలనీవాసులు అధికారులను ఆశ్రయించారు. కాలనీలో కోతుల సంచారం అధికంగా ఉందని, వీటి వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు వాపోయారు. కోతులు ఇళ్లలోని సామగ్రిని తీసుకెళ్లడంతో పాటు మనుషులపై భౌతికంగా దాడులు చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు నాలుగు రోజుల వ్యవధిలో 20 మంది కాలనీవాసులపై కోతులు దాడి చేశాయని తెలిపారు. వీటిని బారి నుంచి తమను రక్షించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం కార్యదర్శి బండే శేషగిరిరావుకు వినతి పత్రం అందించారు.

ఘనంగా అమ్మవారి జాతర



అవనిగడ్డ:మండల పరిధిలోని పులిగడ్డ గ్రామ దేవత లంకమ్మ అమ్మవారి జాతర మహోత్సవ కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. పులిగడ్డ గౌడ సంఘం ఆధ్వర్యంలో ట్రాక్టర్‌పై ప్రత్యేక మందిరాన్ని ఏర్పాటు చేసి డప్పు వాయిద్యాలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు.

కృత్తివెన్ను:కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా కొలువైన మాట్లాం గ్రామ ఇలవేల్పు శ్రీ మొగదారమ్మ తల్లి జాతర మహోత్సవం ఘనంగా జరుగుతుంది. వారం రోజులపాటు జరిగే ఈ జాతర ఈ నెల 21, 22వ తేదీల్లో జరిగే నైవేద్యాలతో ముగియనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

టీడీపీ కార్యాలయంలో మినీ మహానాడు

పెడన: నియోజకవర్గం టీడీపీ కార్యాలయంలో సోమవారం మినీ మహానాడు నిర్వహించారు. మంత్రి కొల్లు రవీంద్ర పాల్గొని నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మోపిదేవి: మండల కేంద్రంలో మినీ మహానాడు సోమవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మంత్రి రవీంద్ర పాల్గొన్నారు.

24 నుంచి నాటక ప్రదర్శనలు

చల్లపల్లి:స్థానిక ఎన్‌టీఆర్ పార్కులోని కళావేదిక ప్రాంగణంలో జానపద, పౌరాణిక నాటక ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు ప్రముఖ సినీ, నాటక రంగస్థల నటుడు, నంది అవార్డు గ్రహీత బోలెం రామారావు సోమవారం తెలిపారు. ఈ నెల 24, 25వ తేదీల్లో రెండు రోజుల పాటు ప్రదర్శనలు ఉంటాయన్నారు.

పేరుకే స్టేడియం.. వసతులు శూన్యం!

- కనీస సౌకర్యాలు లేక క్రీడాకారులు ఇక్కట్లు
- నిర్వహణను గాలికొదిలేసిన పాలకులు
- కర్రలకు లైట్లు కట్టి షటిల్ ఆడుకుంటున్న క్రీడాకారులు



కోడూరులోని పేర్ల సుబ్బారావు ఇండోర్ స్టేడియం

కోడూరు:వర్షం పడుతున్న పైకప్పు.. దెబ్బతిన్న ఫ్లోరింగ్.. శిథిలావస్థకు చేరిన తలుపులు.. కర్రలకు కట్టిన ట్యూబ్‌లైట్లు.. క్రీడాకారులకు ఆడుకొనేందుకు కానరాని వసతులు.. ఇది కోడూరు మండలంలోని ఇండోర్ స్టేడియం దుస్థితి. స్థానిక తహసీల్దార్, ఎమ్మార్సీ కార్యాలయాల పక్కన 2003 లో రూ.10 లక్షల వ్యయంతో స్టేడియం నిర్మించారు. ఈ స్టేడియం స్థలం ప్రభుత్వంది కాగా కోడూరుకు చెందిన దివంగత పేర్ల సుబ్బారావు జ్ఞాపకార్థం కుటుంబసభ్యులు రూ.2 లక్షలు, లయన్స్ క్లబ్ సభ్యులు రూ.లక్ష నగదును నిర్మాణానికి విరాళం అందించారు. వీటితో పాటు ప్రభుత్వం రూ.7 లక్షల నిధులను నిర్మాణానికి మంజూరు చేసింది. ఈ స్టేడియంకు సైతం 'పేర్ల సుబ్బారావు ఇండోర్ స్టేడియం' అని నామకరణం చేశారు. మొదట్లో ఈ స్టేడియం నిర్వహణ బాగానే ఉండడంతో ఉదయం, సాయంత్రం వేళల్లో యువత షటిల్, క్యారమ్స్, వాలీబాల్‌తో పాటు పలు రకాల ఇండోర్ గేమ్స్‌ను ఆడుకొనేవారు.

ఇబ్బందులు పడుతున్న క్రీడాకారులు

కోడూరు మండలంలో షటిల్ బ్యాడ్మింటన్ ఆడేందుకు యువత ఉత్సాహం చూపుతున్నారు. రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ స్థాయిలో జరిగే షటిల్ పోటీల్లో మండలానికి చెందిన క్రీడాకారులు పాల్గొని తమ సత్తా చాటుతున్నారు. ప్రస్తుతం వేసవి సెలవులు కావడంతో స్టేడియంలో ఆడుకొనేందుకు వచ్చేవారికి సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. క్రీడాకారులు షటిల్ ఆడేందుకు స్టేడియంలో వసతులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్టేడియం కింద భాగంలోని సిమెంట్ ఫ్లోరింగ్ గుంతలు పడింది. స్టేడియం పైకప్పు నుంచి కూడా వర్షం పడుతుంది. స్టేడియం లోపల లైటింగ్ వ్యవస్థ లేకపోవడంతో క్రీడాకారులు కర్రలకు ట్యూబ్‌లైట్లు కట్టుకొని షటిల్ ఆడుకుంటున్నారు. లైటింగ్ సౌకర్యం పూర్తిస్థాయిలో లేకపోవడంతో ఆడేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాలీబాల్ ఆడేందుకు స్టేడియంతో ఏవిధమైన వసతులు లేవు. ఇండోర్ గేమ్స్‌కు సంబంధించిన పరికరాలు గానీ మహిళా క్రీడాకారులు ఆడుకొనేందుకు సదుపాయాలు కరువయ్యాయి.

వసతులు కల్పించాలని వినతి

ఇండోర్ స్టేడియం దుస్థితిపై ఇటీవల క్రీడాకారులు ప్రజాప్రతినిధులకు వినతులు కూడా అందించారు. బందరు ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌కు స్టేడియంలో సౌకర్యాలు కల్పించాలని వినతిపత్రాలు అందించారు. స్టేడియం కిందభాగంలో సింథటిక్ లేదా వుడెన్ కోర్టును ఏర్పాటు చేయాలని కోరారు. స్టేడియంలో ఆడుకొనేందుకు వసతులు కల్పించి క్రీడాకారులను ప్రోత్సహించాలని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందించి నెలలు గడుస్తున్నా కూడా వారి నుంచి ఏవిధమైన స్పందన లేకపోవడంతో క్రీడాకారులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

లోపించిన అధికారుల పర్యవేక్షణ

స్టేడియం నిర్వహణపై అధికారుల పర్యవేక్షణ పూర్తిగా లోపించింది. స్టేడియం తహసీల్దార్, మండల పరిషత్, విద్యాశాఖ కార్యాలయాలకు కూతవేటు దూరంలో ఉన్నా కూడా అధికారులు ఆ స్టేడియంపై కన్నెత్తైనా చూడడం లేదని క్రీడాకారులు వాపోతున్నారు. స్టేడియం ప్రాంతం మందుబాబులకు అడ్డాగా మారిన కూడా కనీసం పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. రూ.లక్షలాది పెట్టి నిర్మించిన స్టేడియంలో వసతులు కల్పనపై పాలకులు దృష్టి సారించకపోవడంతో శిథిలావస్థకు చేరిందని క్రీడాకారులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి స్టేడియంలో వసతులు కల్పనకు చర్యలు తీసుకోవాలని క్రీడాకారులు కోరుతున్నారు.

ఉడెన్ కోర్టు ఏర్పాటు చేయాలి



వసతులు లేక షటిల్ ఆడుకొనేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. కింద భాగంలో సిమెంట్ ఫ్లోరింగ్ ఉండడంతో ఆడే సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. వుడెన్ లేదా సింథటిక్ ఫ్లోరింగ్ కోర్టుగా మారిస్తే క్రీడాకారులకు ఎంతగానో ఉపయోగపడుతుంది.

– కమతం ఇమ్మానియేల్, కోడూరు

వసతులు లేక ఇబ్బందులు పడుతున్నాం



ఇండోర్ స్టేడియంతో క్రీడాకారులు ఆడుకొనేందు కనీస వసతులు కూడా లేవు. స్టేడియం పైకప్పు నుంచి వర్షం నీరు కూడా పడుతుంది. కిందభాగంలో ఫ్లోరింగ్ దెబ్బతినడంతో షటిల్ బ్యాట్మింటన్, ఇండోర్ గేమ్స్ ఆడేందుకు వీలు లేకుండా పోయింది.

– పాసం భవానీప్రసాద్, కోడూరు

సరస్వతి పుష్కరాలకు ఆర్టీసీ సర్వీస్

మచిలీపట్నంటౌన్:సరస్వతి పుష్కరాలను పురస్కరించుకుని ప్రసిద్ధ కాళేశ్వరం పుణ్య క్షేత్రంకు ఆంధ్ర ప్రదేశ్ ప్రజా రవాణా సంస్థ మచిలీపట్నం డిపో నుంచి సూపర్ లగ్జరీ బస్సు సర్వీస్‌ను ఏర్పాటు చేశామని డిపో మేనేజర్ టి.పెద్దిరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21వ తేదీ బుధవారం రాత్రి 8 గంటలకు ఈ బస్ సర్వీసు మచిలీపట్నంలో బయలుదేరి ఉదయం కాళేశ్వరం చేరుతుందన్నారు. పుష్కర స్నానం, కాళేశ్వరుని దర్శనం అనంతరం రామప్ప దేవాలయం, మేడారం సమ్మక్క–సారలమ్మల దేవాలయం, వరంగల్ నగరంలోని వెయ్యి స్తంభాలగుడి, భద్రకాళి దేవాలయము సందర్శించుకొని 23వ తేదీ ఉదయం మచిలీపట్నంకు చేరుతుందన్నారు. ఒక్కరికి టిక్కెట్ ధర రూ. 2 వేలుగా నిర్ణయించామన్నారు. ఎక్కువ మంది ప్రయాణికులు బృందంగా టిక్కెట్‌ను కొనుగోలు చేస్తే వారు కోరిన చోట నుంచి బస్సు బయలుదేరుతుందని పేర్కొన్నారు. భక్తులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కోరారు. టిక్కెట్ అడ్వాన్స్ రిజర్వేషన్ కోసం 8808807789, 9963284363, 7382800995 సెల్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

దరఖాస్తులకు సమయం పొడిగించాలి

మచిలీపట్నంటౌన్: సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు కాల వ్యవధి జూన్ నెల 25వ తేదీ వరకు పొడిగించాలని ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి ఎండీ సద్రుద్దీన్ ఖురేషి సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తగిన ప్రచారం లేకపోవటంతో చాలా మంది మైనార్టీ నిరుద్యోగులు దరఖాస్తు చేసుకునేందుకు ఆలస్యమైందని చెప్పారు. దీంతో సగానికి పైగా అభ్యర్థులు దరఖాస్తు చేయలేకపోయారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో గడువు పొడిగించాలని కోరారు.

అనుబంధ విభాగాలకు అధ్యక్షులు నియామకం

అవనిగడ్డ: నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాలకు అధ్యక్షులను మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయం సోమవారం ప్రకటించింది. యూత్ విభాగం అధ్యక్షుడిగా చింతలపూడి బాల భాస్కర్, రైతు విభాగంకు బీసాబత్తిన ప్రసాద్, బీసీ సెల్‌కు కోలా హరికృష్ణ, ఎస్సీసెల్‌కు వెన్నా ప్రసాద్, మైనారిటీ సెల్‌కు అబ్దుల్ అర్షద్, క్రిస్టియన్ మైనారిటీసెల్‌కు కర్రా రవికుమార్, స్టూడెంట్ విభాగంకు కొడాలి హర్ష, పంచాయతీరాజ్ విభాగంకు బండారు శ్రీనివాసరావు, ఆర్టీ వింగ్‌కు తలుపుల సుధాకర్, వలంటీర్ విభాగంకు అద్దంకి అర్జునరావు, గ్రీవెన్స్‌సెల్‌కు కుంపటి నాగేంద్రబాబు, వాణిజ్య విభాగంకు చిట్టా బాలమురళి, చేనేత విభాగంకు ఆకురాతి భాస్కరరావు, వైఎస్సార్ ట్రేడ్ యూనియన్‌కు బండ్రెడ్డి లక్ష్మీనారాయణ, అంగన్‌వాడీ విభాగంకు కొడాలి సరిత, లీగల్‌సెల్‌కు గద్దం బాబూరావు, సాంస్కృతిక విభాగంకు యాసం శివ రామకృష్ణ, సోషల్ మీడియోకు కార్తీక్ కుండేటి, ఐటీ విభాగంకు గాజుల శ్రీనివాసరావు, డాక్టర్స్ విభాగంకు బెల్లపు హరిబాబు, పబ్లిసిటి వింగ్‌కు విస్సంశెట్టి నవీన్, బూత్ కమిటీ విభాగంకు మద్ది వెంకట నారాయణను నియమించినట్లు తెలిపారు.

జాతీయ రహదారిపై నల్ల సంచుల కలకలం



రహదారిపై ఉన్న నల్ల మూటలు

చల్లపల్లి: చల్లపల్లి–మచిలీపట్నం 216 జాతీయ రహదారిపై పడివున్న నల్ల సంచులు స్థానికంగా కలకలం రేపాయి. సోమవారం తెల్లవారుజామున ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు నల్ల క్యారీబ్యాగులలో నింపబడిన ఆరు పెద్ద మూటలను రామానగరం లక్ష్మీపురం సర్వీసు రోడ్ల మధ్యలో జాతీయ రహదారి పక్కన పడేసి వెళ్ళిపోయారు. అయితే వాటిని ఎక్కడ నుంచి తీసుకువచ్చారో... ఎవరు పనికట్టుకుని ఇక్కడ పడేసి వెళ్ళిపోయారనేది తెలియాల్సి ఉంది. గతంలో లక్ష్మీపురం పంచాయతీ శివారు ఎస్టీ కాలనీ వద్ద జాతీయ రహదారి పక్కనున్న చెరువులో నిత్యం గుర్తు తెలియని వ్యక్తులు వాహనాలపై వెళుతూ మూటలు పడేసి వెళుతుండేవారు. అలా వేయగా వేయగా... చివరికి ఆగుంట నిండా మూటలు నిండిపోయి ఉండటంతో స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. అధికారులు వచ్చి వాటిని పరిశీలిస్తే అవి ఆక్వా ఫ్యాక్టరీలలో వచ్చే వ్యర్థాలుగా గుర్తించారు. పంచాయతీ వారు అన్ని చుట్టు పక్కల అన్ని ఆక్వా కంపెనీలకు నోటీసులు ఇవ్వటంతో ఆ తరువాత ఎవరూ అలాంటి సంచి మూటలు అక్కడ వేసిన దాఖలాలు లేవు. తాజాగా సోమవారం ఏకంగా ఇలా రోడ్డు పక్కనే పడేవేసి వెళ్ళిపోవటం చర్చనీయాంశంగా మారింది. అందులో ఏమున్నాయో... ఏమిటో అని స్థానికులు భయపడుతున్నారు. సోమవారం సాయంత్రం చీకటి పడే వరకూ ఆ మూటలు అక్కడే ఉన్నాయి. ఓ పక్క స్వచ్ఛ సుందర చల్లపల్లి ఆదర్శవంతమైన గ్రామంగా రూపొందుతున్న సమయంలో ఇలా రోడ్డుపక్కన మూటలు పారవేయటంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వీటిని ఇక్కడ వేసినవారిని గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ప్రజలు కోరుతున్నారు.

అద్భుతం శ్రీమన్నారాయణుడి క్షేత్రం

స్వామివారిని దర్శించుకున్న రంగరామానుజ జీయర్ స్వామిజీ



శ్రీమన్నారాయణుడికి పూజలు చేస్తున్న రంగ రామానుజ, అష్టాక్షరీ, బృందావనం స్వామిజీలు

కోడూరు:కర్ణాటకలోని మేల్కోట తరహాలో ఉల్లిపాలెంలో నిర్మించిన గోదా, రాజ్యలక్ష్మీ సమేత శ్రీమన్నారాయణ స్వామివారి ఆలయ నిర్మాణ శైలి అద్భుతంగా ఉందని కాకినాడకు చెందిన ఉపనిషత్ సిద్ధాంత ఆచార్య పీఠాధిపతి త్రిదండి రంగరామానుజ జీయర్ స్వామిజీ అన్నారు. అష్టాక్షరీ పీఠాధిపతి అష్టాక్షరీ సంపత్‌కుమార రామానుజీయర్ స్వామిజీ, బృందావనం స్వామిజీతో కలిసి రంగరామానుజ స్వామిజీ శ్రీమన్నారాయణుడి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. గోదాదేవి, రాజ్యలక్ష్మీ అమ్మవారి ఉపాలయాలను పరిశీలించారు. ఆంధ్రరాష్ట్రంలో 11 అడుగుల ఏకశిలా శ్రీమన్నారాయణుడి విగ్రహం ఈ క్షేత్రంలో ఉండడం ఈ ప్రాంతవాసులు అదృష్టమని తెలిపారు. ఆలయ నిర్మాణ శైలిలో జీవకళ ఉట్టిపడుతుందని స్వామిజీ అన్నారు. గర్భాలయంలోని మూలమూర్తిని ఆలయంపై ఉన్న శిఖరాలను ఏకకాలంలో దర్శించుకొనే అవకాశం ఈ ఆలయంలో కలిగిందన్నారు. ఆలయంలో జరిగే ప్రత్యేక కార్యక్రమాలు, జరిగే పూజలను పండితులు స్వామిజీకి వివరించారు. అనంతరం రామానుజాచార్యులు, నమ్మాళ్వార్లు ఆలయాలతో పాటు అష్టభూజ మండపాలను సందర్శించారు. నూతనంగా నిర్మిస్తున్న గర్భాలయాన్ని పరిశీలించారు.

హిందూ శ్మశానవాటిక అభివృద్ధికి కృషి చేద్దాం



మాట్లాడుతున్న బొడ్డు వేణుగోపాలరావు

పెడన:పెడనలోని హిందూ శ్మశాన వాటిక అభివృద్ధికి కృషి చేయాల్సిన అవసరం ఉందని రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు అన్నారు. గంగా పార్వతీ సమేత అగస్త్యేశ్వరస్వామి దేవస్థానం ఆవరణలో హిందూ శ్మశాన వాటిక అభివృద్ధి, పరిరక్షణ సమావేశం బళ్ల ప్రసాద్ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వేణు మాట్లాడుతూ దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న పెడన హిందూ శ్మశాన వాటిక అభివృద్ధి, పరిరక్షణ కోసం కమిటీ ఏర్పాటు చేశామని చెప్పారు. ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, ఎంపీ వల్లభనేని బాలశౌరిలు హిందూ శ్మశాన వాటిక అభివృద్ధి కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఈ మేరకు అభివృద్ధికి సంబంధించి రూ.5.14 కోట్లతో అంచనాలు రూపొందించినట్లు తెలిపారు. కట్టా హేమసుందరమూర్తి, ప్రకాశరావు, బొడ్డు దీక్షనందుడు, వెంకటేశ్వరావు, సాంబశివరావు తమ్మా భీమయ్య శ్యామలయ్య, చంద్రరావు, శివ ప్రసాద్, మహాదేవమూర్తి, లోకానాథం పాల్గొన్నారు.

ఎస్సీ కాలనీలో డ్రైనేజీ పూడిక తీత

చినకళ్లేపల్లి(ఘంటసాల): వర్షాల నేపథ్యంలో కాలనీల్లో ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు పలు గ్రామాల్లో డ్రైనేజీలు పూడిక తీయిస్తున్నట్లు డెప్యూటీ ఎంపీడీవో కె.వెంకటేశ్వరరావు అన్నారు. చినకళ్లేపల్లి ఎస్సీ కాలనీలో సోమవారం డ్రైనేజీ పూడిక తీత పనులను అధికారులు చేపట్టారు. పొక్లెయిన్ సాయంతో ఎస్సీ కాలనీతో పాటు పలు ప్రాంతాల్లో ప్రధాన రహదారుల వెంబడి ఉన్న డ్రైయినేజీల్లో పూడిక తీయించారు. పంచాయతీ కార్యదర్శి అబ్దుల్ నయామ్ ఆధ్వర్యంలో జరుగుతున్న పూడిక తీత పనులను పరిశీలించి సూచనలు, సలహాలు అందించారు.

బందరులో భారీ వర్షం

మచిలీపట్నంటౌన్:మచిలీపట్నం నగరంలో సోమవారం కూడా భారీ వర్షం కురిసింది. ఆదివారం ఉదయం కురిసిన భారీ వర్షానికి నగరంలోని ప్రధాన రహదారులతో పాటు కాలనీల్లోని అంతర్గత రహదారులు ముంపునకు గురయ్యాయి. సోమవారం మధ్యాహ్నం ఆకాశం మేఘావృతమై చల్లటి గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. పలు ప్రాంతాల్లో రోడ్లు జలమయమయ్యాయి. ప్రధాన, అతర్గత డ్రెయిన్‌లు వర్ష పునీటితో ఉధృతంగా ప్రవహించాయి. పలు ప్రాంతాల్లోని డ్రెయిన్‌లలో చెత్తా చెదారాలు అడ్డుపడి ప్రవాహానికి అడ్డంకి ఏర్పడగా మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు వాటిని తొలగించి నీటి ప్రవాహం సజావుగా సాగేలా చూశారు. సోమవారం తెల్లవారు జామున ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో వాతావరణం చల్లగా ఉండటంతో నగర వాసులు ఆహ్లాదంగా గడిపారు.

అవనిగడ్డ ఉపసర్పంచ్‌గా మల్లేశ్వరి

అవనిగడ్డ:అవనిగడ్డ ఉపసర్పంచ్‌గా వైఎస్సార్ సీపీ బలపరచిన 17వ వార్డు సభ్యురాలు మురుగుడు మల్లేశ్వరి ఎన్నికయ్యారు. గతంలో ఉపసర్పంచ్‌గా పనిచేసిన కోడూరు సత్యనారాయణ రాజీనామా చేయడంతో ఇక్కడ ఖాళీ ఏర్పడింది. మొత్తం 14 మంది వార్డు సభ్యులు హాజరుకాగా, గాజుల జయగోపాల్ మల్లేశ్వరి పేరుని ప్రతిపాదించగా, సత్యనారాయణ బలపరచారు. దీంతో ఉపసర్పంచ్‌గా మల్లేశ్వరి ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి వెంకటేశ్వరరావు తెలిపారు. ఉపసర్పంచ్‌గా ఎన్నికైన మల్లేశ్వరికి సర్పంచ్ గొరుముచ్చు ఉమాతో పాటు పలువురు పాలకవర్గ సభ్యులు అభినందన తెలిపారు.

పంట కాలువలకు రూ.2.25 కోట్లు నిధులు విడుదల

అవనిగడ్డ:నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో పంటకాలువల పూడికతీత, గుర్రపుడెక్క తొలగింపు పనులకు రూ.2.25 కోట్లు మంజూరైనట్లు శాసనసభ్యుడు మండలి బుద్ధప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కెఈబీ కెనాల్ పరిధిలో ఆరు పనులకు రూ.26,85,000, డిస్ట్రిబ్యూటరీ కమిటీల పరిధిలో పది పనులకు రూ.49,34,000, సాగు నీటి సంఘాల పరిధిలో పనులకు రూ.1.48 కోట్లు నిధులు మంజూరైనట్టు చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అవనిగడ్డ:స్థానిక కోడూరు రోడ్డులోని పాత విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ వైర్లపై వాలిన చెట్ల కొమ్మలను తొలగించేందుకు మంగళవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ వెంకటేశ్వరరావు తెలిపారు. రామకోటిపురం, రామచంద్రపురం, దక్షిణ చిరువోలులంక, వలందపాలెం, సర్ధాకోడు, మేడిలంక, అయ్యవారిపాలెం, ఒడుగువారిపాలెం, మాచవరంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకే వర్తింపచేయాలి

చల్లపల్లి:కేవలం ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలకు మాత్రమే తల్లికి వందనం వర్తింపచేయాలని ఎస్సీ ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరపలి సురేష్ ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక కోమలానగర్ ప్రాంతంలోని బాలబాలికలను సోమవారం సాయంత్రం సురేష్ కలిసి వారికి డ్రాయింగ్ పుస్తకాలు, రంగుల పెన్సిళ్ళు అందజేశారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడారు.

22 నుంచి విజయ అమలేశ్వరి దేవి ఉత్సవాలు



జాతర మహోత్సవాలకు ముస్తాబు అయిన ఆలయ ప్రాంగణం

పెడన:మండల పరిధిలోని దావోజిపాలెం గ్రామంలో వేంచేసి ఉన్న విజయ అమలేశ్వరి దేవి జాతర మహోత్సవాలు ఈ నెల 22వ తేదీ నుంచి ప్రారంభం కానున్నట్లు ఆలయ కమిటీ పెద్దలు, విజయ అమలేశ్వరి ట్రస్ట్ ప్రతినిధులు అంకెం శ్రీనివాసరావు తెలిపారు. 11 సంవత్సరాలకు ఒకసారి 11 రోజులు పాటు జరిగే ఈ జాతర మహోత్సవాలు 22న ప్రారంభమై జూన్ ఒకటో తేదీ వరకు కొనసాగుతాయన్నారు. ఆలయాన్ని ముస్తాబు చేయడం, చలువ పందిళ్ల వేయడం, విద్యుద్దీపాలంకరణ చేశారు. ఈ ఉత్సవాలను పురస్కరించుకుని జయింట్‌వీల్, రంగులరాట్నం వంటివి ఇప్పటికే ఆలయ పరిసర ప్రాంతాలకు చేరుకున్నాయి. అంకెం ఇంటి పేరిట వారితో పాటు అంకెం ఆడపడుచులు తరలిరానున్నారు. 11 రోజులు పాటు అత్యంత భక్తిశ్రద్ధలతో, అంగరంగవైభవంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయనున్నారు.

కనులపండువగా కాశీవిశ్వేశ్వరుని కల్యాణం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

భావదేవరపల్లి(నాగాయలంక):అన్నపూర్ణ దేవి సమేత కాశీవిశ్వేశ్వర స్వామి దేవస్థానం ద్వితీయ వార్షిక కల్యాణ బ్రహ్మోత్సవాలు సోమవారం వైభవంగా ముగిశాయి. అర్చకులు ఆకెళ్ళ దేవనాథ్‌శర్మ బ్రహ్మత్వంలో వేద పండితుల నేతృత్వంలో స్వామివారి కల్యాణం ఆదివారం అర్ధరాత్రి వరకు గ్రామస్తుల సమక్షంలో కనులపండువగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పూషడపు నిరంజనరావు–శివసత్యవతి దంపతులు పీటలపై కూర్చుని పెళ్ళి తంతు పూజాదికములు జరిపారు. గ్రామానికి చెందిన గువ్వాబత్తిన కేశవరావు, సీతారావమ్మ దంపతులు అమ్మవారికి మంగళ సూత్రాలు సమర్పించారు. కల్యాణం సందర్భంగా పంచహారతులు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ మండలి ఉదయభాస్కర్, సమరసత సేవా ఫౌండేషన్ విజయవాడ కన్వీనర్ అనుమోలు జగన్‌మోహన్, కృష్ణా జిల్లా కన్వీనర్ యోదురువాడ శ్రీనివాసరావు, ఉమ్మడి కృష్ణా ధర్మ ప్రచారక్ ఆళ్ళ జయశంకర్ ముఖ్య అతిథులుగా ఈవేడుకలో పాల్గొన్నారు.

అతిథులను ఆలయ ధర్మకర్త నిరంజనరావు సన్మానించారు. కాగా సోమవారం ఉదయం స్వామి వారికి అభిషేకాలు, పూర్ణాహుతి నిర్వహించారు. సాయంత్రం స్వామివారిని గ్రామంలో ఊరేగింపు తదుపరి ద్వాదశ ప్రదక్షిణలు, ధ్వజారోహణలతో బ్రహ్మోత్సవాలకు స్వస్తి పలికారు.

వస్తువులు కొనుగోలులో జాగ్రత్తలు పాటించండి

లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ ఈశ్వరరావు



మాట్లాడుతున్న ఈశ్వర్‌రావు

మచిలీపట్నంటౌన్: వస్తువులను కొనుగోలు చేసే సమయంలో ప్రజలు కనీస జాగ్రత్తలు పాటించాలని లీగల్ మెట్రాలజీ మచిలీపట్నం ఇన్‌స్పెక్టర్ ఎన్. ఈశ్వరరావు తెలిపారు. లీగల్ మెట్రాలజీ వారోత్సవాల్లో భాగంగా సోమవారం నగరంలోని బస్టాండ్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈశ్వరరావు మాట్లాడుతూ ఎమ్మార్పీ కంటే అధికంగా వసూలు చేసే వ్యాపారులపై ఫిర్యాదు చేయాలని సూచించారు. వస్తువు తయారీ ఎక్స్పైరీ తేదీలను పరిశీలించి కొనుగోలు చేయాలని పేర్కొన్నారు. ఎమ్మార్పీ కంటే అధిక రేట్లకు సరుకులను విక్రయించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

శోభాయమానంగా శోభాయాత్ర



బంటుమిల్లి:సనాతన ధర్మంలో భాగమైన హిందూ సంస్కృతీ సాంప్రదాయాలను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. హిందూ శోభాయాత్ర సంఘం సోమవారం ఏర్పాటు చేసిన బైక్ ర్యాలీని జెండా ఊపి ఆయన ప్రారంభించారు. సువర్చాలాంజనేయస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆర్ఎస్ఎస్ జిల్లా కార్యకారిణి సభ్యులు భోగేశ్వరప్రసాద్ మాట్లాడారు. బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల్లోని పలు గ్రామాలకు చెందిన వందలాది మంది ర్యాలీలో పాల్గొన్నారు.

హనుమజ్జయంతి ఉత్సవాలు ప్రారంభం



బంటుమిల్లి:పాశ్చాపురం గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీసువర్చాలాంజనేయస్వామి ఆలయంలో హనుమజ్జయంతి ఉత్సవాలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య సుందరకాండ హోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం స్వామి వారి ప్రధాన మూర్తికి ప్రత్యేక పూజలను అర్చకులు హనుమంతాచార్యులు నిర్వహించారు. శ్రీరామనవమి నుంచి ప్రారంభమైన హనుమాన్ చాలీసా పారాయణం సోమవారం నాటికి 43వ రోజుకు చేరుకుంది.

బహుజన విద్యార్థుల హక్కుల కోసం పోరు



మచిలీపట్నంటౌన్:బహుజన విద్యార్థుల హక్కుల సాధన కోసం నిరంతరం పోరాటం చేయడం బహుజన స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా లక్ష్యం అని సంఘం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి ప్రేమానంద్ అన్నారు. స్థానిక జిల్లా కోర్టు సెంటర్‌లోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో సోమవారం నిర్వహించిన జిల్లా బహుజన స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు.